# అంతియొకయ సంఘం నేర్పే పాఠాలు

సిరియాలో ఉన్న అంతియొకయ (అపో 11:19) ఈ సంఘం హింసాకాలములో స్టెఫెన్ హతసాక్షిగా మరణించిన తరువాత ఉద్భవించిన సంఘం. సంఘం అంటే అప్పటివరకు యెరూషలేములో ఉన్న విశ్వాసులు సమూహమే. మొదటిసారిగా అపో 11:26 లో అంతియొకయ లోనున్న సమూహాన్ని "సంఘం" అని లూకా వ్యవహరించాడు. అదే వచనములో ఈ విశ్వాసుల్ని "క్రైస్తవులు" అని మొదట పిలిచారు. పౌలు అంతియొకయ సంఘాన్ని ఒక్కసారి మాత్రమే ప్రస్తావించాడు (గలతి 2:11). గాని లూకా 14 సార్లు ప్రస్తావించాడు. అంతియొకయ అన్య జనులకు ప్రధాన నగరం.అంతియొకయ లో అనేకులు అన్యజనులు ప్రభువు వైపు తిరుగుతున్నారని యెరూషలేములో ఉన్న అపోస్తులుల విని, హెచ్చరిక పుత్రుడు అని అర్ధమిచ్చు బర్నబాను (అపో 4:36-37) అక్కడికి పంపారు. అంతియొకయలో బోధించుటలో, నేర్పుటలో సహాయము చేయడానికి బర్నబాకు సహాయము చేయుటకు ఒకరు కావాలి. అప్పుడు బర్నబాకు పౌలు జ్ఞాపకం వచ్చి, అతనికోసం తార్సుకు వెళ్ళాడు (అపో 9:30). బర్నబా పౌలును కనుగొని అంతియొకయకు తీసుకొచ్చి ఒక సంవత్సరం పాటు ఇద్దరు కలిసి పని చేసారు. అంతియొకయలో ఉన్న సంఘం అభివృద్ధి చెందింది.అంతియొకయలో శిష్యులు క్రైస్తవులు అనబడ్డారు. అప్పటి నుండి విశ్వాసులు తమ్మునుతాము యూదులు, గ్రీకులు అన్యజనులు అని పిలిపించుట మానివేసి క్రైస్తవులు అని క్రీస్తు నామాన్ని ఆపాదించుకొన్నారు. క్లౌడియా అనే రోమా చక్రవర్తి పాలన

(క్రీ.శ. 41-54) లో కరువు వచ్చింది. రోమా సామ్రాజ్య మంతటిలో ఈ కరువులు వచ్చాయి. కరువు కాలములో

యెరూషలేము దాని ప్రక్కన ఉన్న దేశమైన యూదయ ఇతర ప్రదేశాలకంటే ఎక్కువ గురిఅయ్యేది. శిష్యుల్లో ప్రతి ఒక్కరు తన శక్తి కొలది ఇవ్వడం ఇక్కడ చూస్తాం (29వ వచనం). ఈ విషయాన్ని పౌలు ఇతర సంఘాలకి నేర్పాడు (1కోరింది 16:1-2, 2కోరింది 9:6-11).

**అంతియొకయ సంఘుము ద్వారా 5 విషయాలు నేర్చుకుందాం.**

## 1. శ్రమపడిన సంఘం

" స్టెఫెన్ విషయములో కలిగిన శ్రమనుబట్టి చెదరి పోయినవారు యూదులకు తప్ప మరి ఎవనికిని వాక్యము బోధింపక, ఫేనీకే, కుప్ర, అంతియొకయ ప్రదేశములవరకు సంచరించిరి (అపో 11:19)." ఆదిమ సంఘం హింసించబడి, చెదరగొట్టబడింది. స్తెఫనును చంపిన తరువాత యూదా నాయకులు మరింత ధైర్యము తెచ్చుకొని ఇతర క్రైస్తవులను కూడా హింసించడం మొదలుపెట్టారు. కాబట్టి ఎక్కువమంది విశ్వాసులు యెరూషలేము వదిలి యూదయ, సమరయ దేశాలకు చెదిరిపోయారు. ప్రస్థుతం వారం వారం రెండు గంటలు గుడిలో ఉండటానికే శ్రమలా ఫీలవుతున్నారు. ఆదిమ సంఘం అనుభవించిన శ్రమలలో ఆవగింజంతైనా శ్రమలు లేకుండా జీవిస్తున్నాం.(అపో 8:1) "ఆ కాలమందు యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగినందున, అపొస్తలులు తప్ప అందరు యూదయ సమరయ దేశములయందు చెదరిపోయిరి. "

(అపో 14:22) "శిష్యుల మనస్సులను దృఢపరచివిశ్వాసమందు నిలుకడగా ఉండవలెననియు, అనేక శ్రమలను అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింపవలెననియు వారిని హెచ్చరించిరి.(రోమ 8:17) "మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము; క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల, క్రీస్తుతోడి వారసులము. " (రోమీయులకు 8:18) "మనయెడల ప్రత్యక్షము కాబోవు మహిమయెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని యెంచుచున్నాను. " (ఫిలిప్పీ 1:30) "క్రీస్తునందు విశ్వాసముంచుట మాత్రమే గాక ఆయన పక్షమున శ్రమపడుటయు ఆయన పక్షమున మీకు అనుగ్రహింపబడెను."(కొలొస్స 1:24) "ఇప్పుడు మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమల యందు సంతోషించుచు, సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పడినపాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను. " (1పేతురు 4:13) "క్రీస్తు మహిమ బయలుపరచబడినప్పుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము, క్రీస్తు శ్రమలలో మీరు పాలివారై యున్నంతగా సంతోషించుడి. "పౌలు 40 రకాలైన శ్రమలను అనుభవిస్తూ ఆనందించారు. అతని నోట ఒక్క ఆయసకరమైన మాట కూడా రాలేదు. శ్రమయే ధన్యతగా భావించారు. అంతియొకయ సంఘం కూడా విశ్వాసానికి ఉరిశిక్షలా శ్రమ అనుభవించారు. శ్రమానుభవములోనే సంఘం స్థిరత్వం తెలుస్తుంది. శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుంది. కాబట్టి శ్రమ పడుదాం, ఏ పరిస్థితులోనైనా మనం సహనం కోల్పోక యుందుము గాక!

## 2. విస్తరించిన సంఘం

(అపో 11:20,21,22) "కుప్రీయులు కొందరును కురేనీయులు కొందరును వారిలో ఉండిరి. వీరు అంతియొకయకు వచ్చి గ్రీసు దేశపువారితో మాటలాడుచు ప్రభువైన యేసును గూర్చిన సువార్త ప్రకటించిరి; ప్రభువు హస్తము వారికి తోడైయుండెను గనుక నమ్మిన వారనేకులు ప్రభువుతట్టు తిరిగిరి. వారినిగూర్చిన సమాచారము యెరూషలేములో ఉన్న సంపపువారు విని బర్నబాను అంతియొకయవరకు పంపిరి. "

### సంఘం విస్తరించుట అంటే

1. రక్షణ పొందుచున్న వారు అనుదినము సంఘములో చేర్చబడుట.

2. విశ్వాసులు అధికమై 2 లేదా 3 షిప్టులుగా ఆరాధన చేయుట

పేరు, ప్రఖ్యాతలు కొరకు; మరికొందరైతే తన తధానతరం పిల్లలకి కూడబెట్టుకోవటం కోసం ప్రయాసపడుతున్నారు. పెద్ద పెద్ద చర్చి అవసరమే. కానీ ఆ సంఘములో సరైన వాక్యం లేకపోతే లాభం ఏమిటి? ఆత్మలు రక్షించలేని బోధకులెందుకు? కొన్ని సంఘాలు ఆత్మీయముగా అభివృద్ధి చెందుతున్నాయి. దేవునికే మహిమ! "ఆ దినములో శిష్యుల సంఖ్య విస్తరించుచున్నపుడు (అపో 6:1)" అని ఉంది. 11 మంది శిష్యులు యెరూషలేముకు వచ్చి పెద్ద మేడ గదిలో సమావేశమై 120 మంది విశ్వాసుల బృందములో చేర్చబడ్డారు.

ఆ పైన 3000 మంది (2:41) తరువాత 5000 మంది (4:4) తరువాత అనేకులు (5:14) విస్తరించిరి (6:1) బహుగా విస్తరించిరి (6:7) ప్రబలమై వ్యాపించెను (12:24). అయితే విషయమేమిటంటే సంఘం విస్తరిల్లే కొలది

సణుగులు, అభిప్రాయ బేధాలు వచ్చినట్లు 6:1 లో మనం చూడగలం. సంఘములో హుమెనైయును - అలెక్సెంధ్రు, అను వాళ్ళు ఉంటారు. వీళ్ళు సంఘములో ప్రమాధకారులు. ఇలాంటి వారి వల్ల సంఘములో అనైక్యత వస్తుంది. విస్తరిస్తున్న సంఘాలలో నేడు ఇలాగె ఉంది. ఇట్టి శోధనలో పడకుండా ప్రభువు అంతియొకయ సంఘాన్ని తప్పించాడు. మన సంఘాల్ని కూడా తప్పించును గాక!

## 3.వాక్యము బోధించిన సంఘం

అపొ 11:26 "వారు కలిసి యొక సంవత్సరమంతయు సంఘములో ఉండి బహుజనములకు వాక్యమును బోధించిరి. మొట్ట మొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి. ఏ సంఘమైతే ఉన్నదీ ఉన్నట్లు, ఎక్కువ బోధిస్తుందో ఆ సంఘం ఎంతైనా అభివృద్ధి చెందుతుంది. ఒకరిని ఒకరు పొగుడుకోవడం, సన్మానాలు, దండలు, శాలువాలు ఇవేమీ ప్రయోజనకరమైనవి, వాక్యానుసారమైనవి కావు. లియోనార్డ్ రావెన్ గొప్ప ఉజ్జివ ప్రసంగికుడు. ముక్కు సూటిగా బోధించే వ్యక్తి. అయన ఏమన్నాడంటే "జీవం లేని బోధకులు,జీవం లేని ప్రసంగాలను జీవం లేని సభ్యులకు వినిపిస్తారు" ఇది ఎంతైనా నిజం. నేడు చాలా సంఘాలు ఇట్టి దీన స్థితిలో ఉన్నాయి. ప్రస్తుత సంఘాలు దైవిక సత్యాలు బోధించటం లేదు. వాక్యన్నే బోధించాలి. వాక్యం అవసరత ఒక్కసారి చుడండి.

- (2తిమోతికి 4:2) "వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధిచెప్పుము.
- " యేసు వారికీ వాక్యం బోధించెను (మార్కు 2:2, 4:33)
- వాక్యం అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. (అపో 2:41)
- పౌలు, బర్నబాలు పెర్గే లో వాక్యం బోధించి వెళ్లిరి (అపో 14:25)
- వాక్యం బోధించుటయందు ఆతృత గలవారై (అపో 18:5)
- శక్తిగల వాక్యమును సాత్వికములో అంగీకరించుడి (యాకోబు 1:21)
- పరలోకరాజ్యము సమీపించింది అని సర్వసృష్టికి వాక్యం ప్రకటించాలి. (2తిమో 4:2, మత్త 10:7, లూకా 9:2, మార్కు16:5, లూకా 9:6)

ఆచార ప్రసంగాలకు ఆమెన్ చెప్పే అలవాటు పోవాలి. వేదిక మీద నిలబడి ప్రార్ధనా పూర్వకముగా సిద్ధపడిన వాక్యం ఆత్మలో ప్రకటించినపుడు సంఘం వర్ధిల్లుతుంది.

## 4. సహాయపడిన సంఘం

(అపో 11:28,29) "వారిలో అగబు అను ఒకడు నిలువబడి, భూలోకమంతటను గొప్ప కరవు రాబోవుచున్నదని ఆత్మ ద్వారా సూచించెను. అది క్లౌదియ చక్రవర్తి కాలమందు సంభవించెను. అప్పుడు శిష్యులలో ప్రతివాడును తన తన శక్తికొలది యూదయలో కాపురమున్న సహోదరులకు సహాయము పుంపుటకు నిశ్చయించుకొనెను. అంతియొకయ (సంఘస్థులు) క్రైస్తవులు యూదయలో ఉన్న తమ సహోదరులకు కొంత సహాయం పంపాలి అని నిర్ణయించారు.

వారు కొంత సొమ్ము పోగుచేసి సౌలు, బర్నబాలతో పెద్దలకు పంపారు. నిజమైన క్రైస్తవ్యానికి నిదర్శనం దాతృత్వం. ప్రభువు మనకిచ్చిన దానిలో నుండి కొంత అక్కరలో ఉన్న ప్రజలకు ఇవ్వాలి. ఇవ్వడం నేర్చుకోవాలి.

పాత నిబంధన (మలాకీ 3:10) "నా మందిరములో ఆహారముండునట్లు పదియవభాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొనిరండి; దీని చేసి మీరు నన్ను శోధించినయెడల నేను ఆకాశపువాకిండ్లను విప్పి, పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. "

1కొరి 16:2 నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను.

1. వర్ధిల్లిన కొలది (1కోరింది 16:2)

2. తన శక్తి కొలది (అపో 11:29)

3. తన సమార్ధ్యము కంటే ఎక్కువుగా (2 కోరి 8:4)

4. కలిగిన దంతయు (మార్కు 12:44)

సనుగుతూ, బలవంతముగా, మెప్పు కొరకు ఇవ్వకూడదు,పుచ్చుకొనుటకంటే ఇచ్చుట ధన్యత అను యేసు మాటలు జ్ఞాపకము చేసుకుందుము (అపో 20:35, మత్త 10:8).

## 5.సేవకులను పంపిన సంఘం

అపొస్తలుల కార్యములు 13:1,2,3 "అంతియొకయలోనున్న సంఘములో బర్నబా, నీగెరనబడిన సుమెయోను, కురేనీయుడైన లూకియ చతుర్థాధిపతియైన హేరోదుతో కూడ పెంచబడిన మనయేను, సౌలు అను ప్రవక్తలును బోధకులును ఉండిరి. వారు ప్రభువును సేవించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మనేను బర్నబాను సౌలును పిలిచిన పనికొరకు వారిని నాకు ప్రత్యేకపరచుడని వారితో చెప్పెను. అంతట వారు ఉపవాసముండి ప్రార్థనచేసి వారిమీద చేతులుంచి వారిని పంపిరి. "ప్రథమ మిషనరీ జట్టును పంపిన అంతియొకయ సంఘం మన అందరికి ఆదర్శం. ఈ సంఘం చేత పంపబడిన బర్నబా మరియు పౌలు ఆ సంఘ సభ్యులలో ప్రత్యేకం. సంఘం వారిని పంపి ఊరికోలేదు. వారి కోసం ప్రార్థించెను. అందుకే అంతియొకయ సంఘాన్ని మిషనరీ సంఘం అంటారు. అలంటి సంఘాలు రావాలి కావాలి. అప్పుడే ప్రపంచ సువార్తీకరణ జరుగును. మీరు ఏ సంఘమో నాకు తెలియదు. మీ సంఘ వయస్సు నాకు తెలియదు. కాని మీ సంఘం శ్రమలో సహనం చూపిస్తుందా? మీ సంఘం విస్తరించి ఉందా? మీ సంఘం నిజమైన సత్య సువార్తను ప్రకటిస్తుందా? మీ సంఘం సహాయపడుతుందా? మీ సంఘం సేవకులను పంపుతుందా? ఒక్కసారి మన సంఘాల్ని పరీక్షించుకుందాం. అంతియొకయ సంఘములా నిలబడదాం. అట్టి కృప

ఆ దేవాతి దేవుడు మనకు అనుగ్రహించును గాక! ఆమెన్!!!